తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-06-ఏప్రిల్-2026 | సంపుటి : 3 | సంచిక : 308 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# నూతన హైకోర్టు 2027 నాటికి నిర్మాణం పూర్తి

రాజేంద్రనగర్‌లో జోన్-II భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

100 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద న్యాయస్థాన సముదాయం

రాష్ట్రవ్యాప్తంగా మరో 49 కోర్టుల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం

2లో





# సేవ్ సింగరేణి

## మరో ఉద్యమానికి సిద్ధమన్న కల్వకుంట్ల కవిత

డిపెండెంట్ ఉద్యోగాల విచారణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సవాల్

సింగరేణికి ప్రభుత్వం బాకీ ఉన్న రూ. 47 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలి

లిథియం రిఫైనరీ ఒప్పందాల్లో భారీ అవినీతి జరిగిందని తెలంగాణ జాగృతి ఆరోపణ

2లో



## జగ్జీవన్ రామ్ జయంతి నివాళులర్పించిన భట్టి

- ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి
- దేశ ప్రజాస్వామ్య పునాదుల బలోపేతంలో ఆయన పాత్ర చిరస్మరణీయం
- సామాజిక సమానత్వం కోసం జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం

2లో



## సమానత్వానికి ప్రతీకగా నిలిచిన బాబు జగ్జీవన్ రామ్

- బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు
- కొల్లాపూర్‌లో ఘనంగా నిర్వహణ
- సామాజిక సమానత్వానికి ఆయన పోరాటం గుర్తింపు
- యువతకు ఆదర్శంగా నిలవాలని పిలుపు

2లో



## జగ్జీవన్ రామ్ జయంతి.. నివాళులు అర్పించిన బండి సంజయ్

- సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్
- కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి
- యువత ఆయన ఆదర్శాలను పాటించాలని కేంద్ర మంత్రి పిలుపు

2లో



## మార్పు కోసం ఓటు – కాంగ్రెస్‌తోనే భవిష్యత్తు

తెలంగాణ మోడల్‌ను కేరళలో అమలు చేస్తాం

యూడిఎఫ్‌కు మద్దతుగా మంత్రి ప్రచారం.. ఎల్‌డిఎఫ్ పాలనపై తీవ్ర విమర్శలు

2లో

## బిజేపీ కార్యకర్తలే పార్టీకి అసలైన బలం

- శిక్షణా కార్యక్రమంలో ఎన్. రాంచందర్ రావు
- జనగాం జిల్లాలో 'పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ్ అభియాన్'
- అంకితభావం, క్రమశిక్షణతో కూడిన కార్యకర్తల తీర్చిదిద్దడమే లక్ష్యం
- అంత్యోదయ సిద్ధాంతమే మోదీ పాలనకు మూలస్తంభమని వెల్లడి



2లో

## యూఎల్‌సీ భూముల్లో ప్లాట్లపై హైడ్రా జోక్యం లేదు

2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సేవ్ సింగరేణి

**హైదరాబాద్, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు, కార్మికుల హక్కుల కోసం మరో తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాడేందుకు సిద్ధమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 'సేవ్ సింగరేణి' పేరుతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల నియామకాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం గత ప్రభుత్వ పాలసీ అని, దానిపై విచారణ జరపడం విడ్డూరమని ఆమె విమర్శించారు. సింగరేణి కార్మికుల కష్టాలను అర్థం చేసుకోని ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉందని కవిత ధ్వజమెత్తారు. కష్టపడి చెమటోడ్చి దేశానికి వెలుగునిచ్చే కార్మికులపై విచారణలు ఆపి, సంస్థలో జరుగుతున్న అసలైన అవినీతిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. డీజిల్ కుంభకోణం, నిబంధనల ఉల్లంఘనల వల్ల సింగరేణికి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని కాగ్ రిపోర్ట్ చెబుతోందని, వాటిపై ఎందుకు విచారణ జరపడం లేదని ఆమె ప్రశ్నించారు. సింగరేణికి ప్రభుత్వం కరెంట్ మరియు బొగ్గు బకాయిల కింద చెల్లించాల్సిన రూ. 47 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో కార్మికుల భద్రత, జీతాలకు ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు.

లిథియం రిఫైనరీ మరియు రాజస్థాన్ సోలార్ ఒప్పందాల్లో భారీ కుంభకోణాలు జరిగాయని కవిత ఆరోపించారు. కేవలం రూ. 27 లక్షల ఆదాయం ఉన్న 'అల్ట్ మిన్' అనే చిన్న సంస్థతో రూ. 2250 కోట్ల ఒప్పందం ఎలా చేసుకున్నారని ఆమె నిలదీశారు. అంతర్జాతీయంగా పెద్ద పెద్ద సంస్థలే లిథియం రిఫైనరీలో నష్టపోతుంటే, అనుభవం లేని సంస్థను భాగస్వామిగా చేయడం వెనుక ఉన్న అవినీతిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే రాజస్థాన్ సోలార్ ప్రాజెక్టులో మెగావాట్ ఉత్పత్తికి అయ్యే ఖర్చు కంటే మూడు రెట్లు అదనంగా ఖర్చు చేస్తున్నారని, దీనిపై తాము త్వరలోనే అధికారికంగా లేఖ రాస్తామని ఆమె వెల్లడించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం మెడికల్ బోర్డును పాత పద్ధతిలోనే నిర్వహించాలని, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కవిత కోరారు. ఇది ప్రాణాలతో కూడిన పని కాబట్టి కార్మికులకు ఈ రాయితీలు అవసరమని 2015లోనే తాను పార్లమెంటులో మాట్లాడినట్లు గుర్తుచేశారు. వైద్య పరీక్షల్లో పాసైన 350 మందికి తక్షణమే పోస్టులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న క్లర్క్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎంఎస్ మరియు ఇతర కార్మిక సంఘాలు సింగరేణి విముక్తి కోసం చేసే పోరాటానికి తెలంగాణ జాగృతి పూర్తి మద్దతు ఉంటుందని ఆమె ప్రకటించారు. కార్మికులతో పెట్టుకున్న ఏ నాయకుడూ బాగుపడలేదని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

# మార్పు కోసం ఓటు – కాంగ్రెస్‌తోనే భవిష్యత్తు

**మావేలిక్కర, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేరళలో యూడిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. మావేలిక్కర అసెంబ్లీ నియోజకవర్గంలో యూడిఎఫ్ అభ్యర్థి ముతర రాజ్‌కు మద్దతుగా ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని, అదే విధంగా కేరళలో యూడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే ఐదు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధి కలగలిపిన పాలన అందిస్తామని పేర్కొన్నారు. కేరళలో గత పది సంవత్సరాలుగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ పాలన ప్రజలను నిరాశపరిచిందని మంత్రి విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

దేశవ్యాప్తంగా విభజన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విభేదాలు పెంచే బీజేపీకి కేరళలో స్థానం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం యూడిఎఫ్ మాత్రమేనని స్పష్టం చేశారు.

"ఇది సాధారణ ఎన్నిక కాదు... కేరళ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నిక" అని పేర్కొంటూ, ప్రజలు ఈసారి మార్పు కోసం ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మంత్రి పొంగులేటి ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

# జగ్జీవన్ రామ్ జయంతి.. నివాళులర్పించిన భట్టి

**ఖమ్మం, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఖమ్మం నగరంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఖమ్మం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. భారత రాజకీయాల్లో అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి, సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమించిన మహనీయుడి సేవలను ఆయన స్మరించుకున్నారు. దేశ ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడంలో జగ్జీవన్ రామ్ పోషించిన పాత్ర అమోఘమని, ఆయన ఒక గొప్ప స్ఫూర్తిప్రదాత అని ఈ సందర్భంగా కొనియాడారు.

కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్ రామ్ తీసుకున్న అనేక నిర్ణయాలు నేటికీ పాలకులకు ఆదర్శప్రాయంగా ఉన్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన ప్రదర్శించిన నాయకత్వ పటిమ చారిత్రాత్మకమని గుర్తుచేశారు. ముఖ్యంగా సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని తెలిపారు. ఆ మహనీయుని ఆశయాలను ముందుకు తీసుకువెళ్లి, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని నేటి తరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం ప్రస్తుతం ప్రజా రంజక పాలనను అందిస్తోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. గతంలో ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు నేటికీ సమాజంలో సానుకూల మార్పులకు కారణమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. దేశ రక్షణ మరియు వ్యవసాయ రంగాల్లో ఆయన తెచ్చిన మార్పులు అద్భుతమని శ్లాఘించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పేదరికం లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. వారందరూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలతో సందడిగా మారాయి. దళిత సంఘాల నాయకులు కూడా పెద్ద ఎత్తున హాజరై తమ ఆరాధ్య దైవానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వం తరపున అధికారికంగా ఈ వేడుకలను నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మహనీయుల స్మరణతో ఖమ్మం జిల్లాలో నూతనోత్తేజం నెలకొంది.

# జగ్జీవన్ రామ్ జయంతి.. నివాళులు అర్పించిన బండి సంజయ్

**కరీంనగర్, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** భారత మాజీ ఉపప్రధాని, సామాజిక విప్లవకారుడు బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు కరీంనగర్ జిల్లాలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నగరంలోని మంచిర్యాల చౌరస్తాకు చేరుకుని, అక్కడ ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత రాజకీయ చరిత్రలో అణగారిన వర్గాల గొంతుకగా, సామాజిక న్యాయం కోసం తన జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడి సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. దేశాభివృద్ధిలో జగ్జీవన్ రామ్ పోషించిన పాత్ర చిరస్మరణీయమని ఆయన గుర్తుచేశారు.

కేంద్ర ప్రభుత్వంలో సుమారు 29 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేసిన జగ్జీవన్ రామ్, దేశ సేవయే పరమ ధర్మంగా భావించి పనిచేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. ఆయన హయాంలో తీసుకువచ్చిన అనేక సంస్కరణలు నేటికీ దేశాభివృద్ధికి పునాదులుగా ఉన్నాయని పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ గారు చూపిన మార్గం, ఆయన అనుసరించిన విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు డిప్యూటీ మేయర్ సునీల్ రావు తదితరులు పాల్గొన్నారు. వీరందరూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు, సామాజిక కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున హాజరై జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జయంతి సందర్భంగా నగరంలో పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. మొత్తంమీద, కరీంనగర్ గడ్డపై బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు రాజకీయాలకతీతంగా ఐక్యమత్యంతో జరిగాయి. ఆ మహనీయుడి ఆశయ సాధనలో భాగస్వాములవుతామని నాయకులు స్పష్టం చేశారు.

# బిజేపీ కార్యకర్తలే పార్టీకి అసలైన బలం

**జనగాం, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** జనగాం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన 'మండల స్థాయి పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ్ అభియాన్' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. అంకిత భావం, క్రమశిక్షణ మరియు సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కార్యకర్తలను తీర్చిదిద్దడమే ఈ శిక్షణా కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. సంస్థాగత బలోపేతమే భారతీయ జనతా పార్టీకి ఉన్న అతిపెద్ద బలమని రాంచందర్ రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ గారు అందించిన 'అంత్యోదయ' సిద్ధాంతం, అంటే సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా ఫలాలు అందాలనే ఆశయమే నేడు బిజేపీ పాలనకు మూలస్తంభంగా నిలిచిందని ఆయన వివరించారు. ఈ సిద్ధాంతం ఆధారంగానే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యకర్తలు ఈ సిద్ధాంతాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని, పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలకు వివిధ అంశాలపై పార్టీ నేతలు అవగాహన కల్పించారు. మోదీ ప్రభుత్వ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. దేశ హితమే పరమావధిగా పనిచేసే బిజేపీ కార్యకర్తలు, రాబోయే రోజుల్లో పార్టీ విజయకేతనం ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించాలని నాయకులు కోరారు.

# యూఎల్‌సీ భూముల్లో ప్లాట్లపై హైడ్రా జోక్యం లేదు

- పాత లే ఔట్లకు రక్షణ హామీ
- రహదారులు, పార్కుల పరిరక్షణపై దృష్టి
- తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** యూఎల్‌సీ (అర్బన్ ల్యాండ్ సీలింగ్) భూముల్లో ఉన్న పాత లే ఔట్లలో నివాసాలే కాకుండా ఖాళీ ప్లాట్లు ఉన్నా వాటి జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేసింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో పలు అంశాలను వివరించింది. యూఎల్‌సీ భూముల్లోని పాత లే ఔట్లలో రెగ్యులరైజ్ కాని ఖాళీ ప్లాట్లపై హైడ్రా ఎలాంటి చర్యలు తీసుకోదని పేర్కొంది. ఖాళీగా ఉన్న స్థలాలను హైడ్రా పేరుతో ఆక్రమించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అలాంటి ప్రచారాలను నమ్మవద్దని నగర ప్రజలను హెచ్చరించింది. ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా హైడ్రా కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించింది. ప్రజలు అపోహలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొంది. లే ఔట్ ప్రణాళిక ప్రకారం రహదారులు, పార్కులు, ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా కాపాడటమే హైడ్రా ప్రధాన లక్ష్యమని తెలిపింది. ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. హైడ్రా ఏర్పాటుకు ముందే ఉన్న నివాసాలను కూల్చబోమని ఇప్పటికే పలుమార్లు వెల్లడించినట్లు తెలిపింది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొంది. ఇటీవల శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో, అలాగే కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్‌లో పార్కులు, రహదారులపై జరిగిన ఆక్రమణలను తొలగించడం ఇందుకు ఉదాహరణగా పేర్కొంది. యూఎల్‌సీ భూములపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, భూములపై అక్రమ ప్రయోజనాల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారని హెచ్చరించింది.

# నూతన హైకోర్టు 2027 నాటికి నిర్మాణం పూర్తి




**హైదరాబాద్, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన సముదాయం పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన హైకోర్టు జోన్II భవన సముదాయం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించగా, పలువురు గౌరవ సుప్రీంకోర్టు మరియు హైకోర్టు న్యాయమూర్తులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేవలం హైకోర్టు భవనమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో మరో 49 కోర్టులు మరియు నివాస భవనాల నిర్మాణ ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు. 2023 డిసెంబర్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న అత్యంత కీలకమైన నిర్ణయాలలో నూతన హైకోర్టు భవన నిర్మాణ నిర్ణయం ఒకటి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టు కోసం రాజేంద్రనగర్ ప్రాంతంలో 100 ఎకరాలకు పైగా భూమిని కేటాయించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం జోన్I లో నిర్మాణ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, తాజాగా జోన్II కింద న్యాయమూర్తులు మరియు సిబ్బంది నివాస భవనాలకు శంకుస్థాపన జరిగిందని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి అన్ని పనులను పూర్తి చేసి, ఈ అత్యాధునిక భవన సముదాయాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థకు అవసరమైన అత్యుత్తమ వసతులను కల్పించడం కార్యనిర్వాహక వ్యవస్థ యొక్క బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. రాబోయే కాలంలో ఈ నూతన హైకోర్టు భవనం దేశంలోనే అతిపెద్ద మరియు ఆధునిక వసతులు కలిగిన న్యాయస్థానాలలో ఒకటిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ మరియు న్యాయవ్యవస్థ పరస్పర గౌరవం మరియు సహకారంతో పనిచేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సామాన్య పౌరులకు న్యాయం లభించే చివరి వేదిక కోర్టులేనని, అటువంటి పవిత్రమైన ప్రాజెక్టులో భాగస్వామి కావడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా, అత్యున్నత ప్రమాణాలతో ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్నామని, ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాదని, న్యాయానికి ప్రతిరూపమని ఆయన కొనియాడారు. పేదలు, అణగారిన వర్గాలు మరియు బలహీన వర్గాల కోసం ఈ నూతన హైకోర్టు భవనం న్యాయం మరియు ప్రజాస్వామ్యానికి చిహ్నంగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టు భవనాన్ని నిర్మించడం అంటే అన్ని వర్గాల ప్రజలకు న్యాయాన్ని అందించే ఒక పవిత్ర స్థలాన్ని సృష్టించడమేనని ఆయన అభివర్ణించారు. దేశంలోని అత్యుత్తమ న్యాయ కోవిదుల సమక్షంలో ఈ కార్యక్రమం జరగడం విశేషమని, ఇది ప్రజాస్వామ్య విలువల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటుతోందని చెప్పారు. ఈ చారిత్రాత్మక సందర్భం హైదరాబాద్ నగరానికి గర్వకారణమని, రాబోయే వంద సంవత్సరాల పాటు ప్రజల అవసరాలను తీర్చే విధంగా ఈ మైలురాయి సంస్థ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలు రాష్ట్రంలో సుపరిపాలనకు సంకేతమని ముఖ్యమంత్రి తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న 49 కోర్టులు జిల్లా మరియు మండల స్థాయిలలో న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తాయని ఆయన వివరించారు. రాజేంద్రనగర్‌లోని ఈ విస్తారమైన సముదాయం అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో రూపుదిద్దుకుంటోందని, దీనివల్ల న్యాయవాదులకు మరియు కక్షిదారులకు మెరుగైన వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు గడువులోగా పూర్తి చేసేలా పనులను నిరంతరం పర్యవేక్షిస్తామని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. న్యాయవ్యవస్థ యొక్క స్వతంత్రతను గౌరవిస్తూనే, అవసరమైన అన్ని వనరులను సమకూర్చడంలో ప్రభుత్వం వెనకాడబోదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నూతన ప్రాంగణం తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తుందని ఆయన అన్నారు. న్యాయం కోసం వేచి చూసే బాధితులకు త్వరితగతిన పరిష్కారాలు లభించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఈ భవన సముదాయంలో అనుసంధానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు మరియు ఇతర ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ, తెలంగాణ అభివృద్ధిలో న్యాయవ్యవస్థ పాత్రను కొనియాడారు. ఈ బృహత్ కార్యం విజయవంతంగా పూర్తి కావాలని ఆయన ఆకాంక్షించారు.

# సమానత్వానికి ప్రతీకగా నిలిచిన బాబు జగ్జీవన్ రామ్

**కొల్లాపూర్, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్‌లో నిర్వహించిన దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ ఒక వర్గానికో, కులానికో పరిమితమైన నాయకుడు కాదని, దేశం గర్వించదగ్గ గొప్ప రాజనీతిజ్ఞుడని పేర్కొన్నారు. సమానత్వం లేని స్వేచ్ఛ అర్థరహితం అని నమ్మిన ఆయన జీవితాంతం సామాజిక న్యాయం కోసం పోరాడారని తెలిపారు.

అంటరానితనం, కుల వివక్షపై అలుపెరుగని పోరాటం చేసి అణగారిన వర్గాలకు ఆత్మగౌరవాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సమాజంలో సమాన హక్కుల సాధనలో ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవాన్ని ప్రోత్సహించి దేశాన్ని ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి విశేషమని తెలిపారు.

కార్మికుల సంక్షేమం కోసం కనీస వేతనాలు, పీఎఫ్, బోనస్ వంటి చట్టాలను ప్రవేశపెట్టి కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని గుర్తుచేశారు. యువత ఆయన క్రమశిక్షణ, దేశభక్తిని ఆదర్శంగా తీసుకుని సమానత్వం, న్యాయం ఉన్న సమాజ నిర్మాణానికి కృషి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నివాళులు

**సత్తుపల్లి, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ దేశానికి జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి పరిపాలనా దక్షత, సామాజిక న్యాయం పట్ల నిబద్ధత ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అదేవిధంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ కూడా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సత్తుపల్లి డిపోలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

- మహానేత సేవలను స్మరించిన ఆర్టీసీ అధికారులు

**సత్తుపల్లి, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) సత్తుపల్లి డిపోలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశానికి ఆయన చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని తెలిపారు. భారతదేశ తొలి ఉప ప్రధానిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, ఎస్సీ-ఎస్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జగన్నాథం, వెంకటయ్య, బసవయ్య, బాలస్వామి, టి.ఐ. త్రీ జాకబ్, ఏడీసీలు కిరణ్ బాబు, కాంతారావు, సత్యం తదితరులు పాల్గొన్నారు. గ్యారేజీ సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



## 10వ వార్డులో కోతుల బెడదకు చెక్.!

- కౌన్సిలర్ దేవ జ్యోతి చర్యలు ఫలితం
- కోతుల పట్టివేత, అటవీ ప్రాంతానికి తరలింపు

**సత్తుపల్లి, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో కొంతకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కోతులు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు ఇళ్లలోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేస్తున్నాయని నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వార్డు కౌన్సిలర్ దేవ జ్యోతి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహన కమల్ పాషా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, కోతుల సమస్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారి మార్గదర్శకత్వంలో మున్సిపాలిటీ ప్రత్యేక కోతి పట్టే బృందాన్ని రంగంలోకి దించింది. శనివారం వార్డులోని పలు వీధుల్లో గాలింపు చేపట్టిన బృందం చాకచక్యంగా కోతులను పట్టుకుని బోన్లలో బంధించింది. పట్టుబడిన కోతులను అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలి వేయనున్నట్లు అధికారులు తెలిపారు. చాలా రోజులుగా ఎదుర్కొంటున్న సమస్య నుంచి విముక్తి కలగడంతో వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.22 లక్షలు నిధులు మంజూరు

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
- నెమలి అనిల్ కుమార్ హర్షం వ్యక్తం

**ఉప్పల్, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ శక్తి సాయి నగర్ డివిజన్ పరిధిలోని యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.22 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు. యాదవ సంఘం అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రాంత అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, యాదవ సంఘం సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. యాదవ సంఘం సభ్యులు యెల్లేష్ యాదవ్, రాజ్‌కుమార్ యాదవ్, మల్లి యాదవ్, కుమార్ యాదవ్, మధు యాదవ్, వినేష్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి మల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు కప్పర సాయి కిరణ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, దంతూరి రాజు గౌడ్, కోయిగుర బాలరాజ్ గౌడ్, ఎస్‌వి కిట్టు, వి. శ్రీనివాస్, మనోహర్, పంజాల శ్రీను, జానీ వేణు, నిక్కీ గౌడ్, టిల్లూ ముదిరాజ్, జాని భాయ్, విజయ్ రెడ్డి, ఫిరోజ్, అన్వర్, జయంత్ గౌడ్, రింకు తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకురాళ్లు జమీలా బేగం, శైలజ, సునీత, లావణ్య కూడా కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. చివరగా ప్రజల అభివృద్ధి కోసం తీసుకుంటున్న ప్రతి నిర్ణయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, శక్తి సాయి నగర్ ప్రాంత అభివృద్ధికి తమ వంతు కృషి కొనసాగుతుందని నెమలి అనిల్ కుమార్ తెలిపారు.

## వెల్టూర్ లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**పెద్దమందడి, ఏప్రిల్5(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అలాగే, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిస్తూ యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడం ద్వారా దేశం మరింత ప్రగతి సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ జడ్పీటీసీ రఘుపతి రెడ్డి, సీనియర్ నాయకులు డిఎస్ మహేష్, మల్లికార్జున్, గుండెల ఆంజనేయులు, వడ్డ శేఖర్, ప్రేమ్ సాగర్, మద్దూరు వెంకటయ్య, మద్దూరు నరసింహ, నాగభూషణ్, దయ్యాల రమేష్, బుసయ్య, మిల్లర్ రాజు, ఆంజనేయులు, యాదయ్య, రాజశేఖర్, రుక్మద్దీన్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

- జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో 201వ వారం జ్ఞానమాల కార్యక్రమం
- మహనీయులకు పూలమాలలతో నివాళులు

**కాప్రా, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**




ఉప్పల్ నియోజకవర్గం కాప్రా మండల్ పరిధిలోని జమ్మిగడ్డ బి.జె.ఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో 201వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్ అంబేద్కర్ మరియు డా. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. డా. బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా ఆయన సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత మాజీ ఉప ప్రధానిగా ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సలహాదారులు ఎస్.ఏ. రహీం, కోఆర్డినేటర్ నర్సింహ్మా చారి సమన్వయం చేశారు. ఈ వేడుకలో బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పావని మణిపాల్ రెడ్డి, అలాగే వివిధ పార్టీల నాయకులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. స్ఫూర్తి గ్రూప్ సభ్యులు, బి.జె.ఆర్ కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుండాలని పాల్గొన్నవారు సంకల్పం వ్యక్తం చేశారు.




## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**సత్తుపల్లి, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**

బి గంగారం 15వ బెటాలియన్ ఆవరణలో మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్ ఏ. అంజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమాండెంట్ బెటాలియన్ ప్రాంగణంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానాయకుడని తెలిపారు. సామాజిక సమానత్వంపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు 1934లో ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్, అఖిల భారతీయ రవిదాస్ మహాసభలకు పునాది వేశారని వివరించారు. అతను పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రివర్గంలో కీలక పదవులు నిర్వహించారని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని, కార్మిక, రక్షణ, వ్యవసాయ శాఖల మంత్రిగా, అనంతరం ఉప ప్రధానమంత్రిగా సేవలందించి విశిష్ట ముద్ర వేశారని పేర్కొన్నారు. ముఖ్యంగా 1971 భారత్-పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా తీసుకున్న నిర్ణయాలు దేశ విజయానికి దోహదపడ్డాయని తెలిపారు. అలాగే వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవానికి చేసిన కృషిని గుర్తుచేశారు. బాబు జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం, న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎ. నరసింహారావు, ఆర్‌ఐలు కె.వి. గోపాల్, పి. ఉదయ్ కుమార్, ఆర్ఎస్ఐలు, అధికారులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద చెర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

- 500 మందికి పైగా ప్రజలకు పరీక్షలు
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**చర్లపల్లి, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**




పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చెర్లపల్లి బస్ స్టాప్ వద్ద నాయకుడు కడియాల పోచయ్య జ్ఞాపకార్థం అపోలో వైద్యశాల సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. చర్లపల్లి అభివృద్ధికి కడియాల పోచయ్య చేసిన సేవలను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 500 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్కాజ్గిరి అదనపు కమిషనర్ వెంకటరమణ, చైర్మన్ గోవింద్ రెడ్డి, మాజీ చైర్మన్లు హరీష్ రెడ్డి, రోషి రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పావని మణిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు కట్టుబడి ముందుకు సాగాలి

■ డీఎస్ మహేష్

**పెద్దమందడి,ఏప్రిల్5(తెలంగాణ ముచ్చట్లు):** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డీఎస్ మహేష్ మాట్లాడుతూ..బాబు జగ్జీవన్ రామ్ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు అపారమని అన్నారు.ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి సామాజిక న్యాయం సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ యువత ముందుకు సాగాలని, సమానత్వం, సామాజిక సమగ్రత కోసం పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎస్.మహేష్, మల్లికార్జున్, బండి రాజు,గుండెల ఆంజనేయులు, ఆంజనేయులు,మద్దూర్ వెంకటయ్య, మద్దూర్ నరసింహ,నాగభూషణ్, ప్రేమ్ సాగర్, రుక్మద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.





## కాప్రాలో రూ.20 లక్షలతో ఓపెన్ జిమ్, చిన్నారుల పార్కు ప్రారంభం

**కాప్రా, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా డివిజన్ పరిధిలోని క్లాసిక్ ఎన్‌క్లేవ్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ జిమ్ మరియు చిన్నారుల పార్కును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, చిన్నారుల వినోదాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సదుపాయాల అభివృద్ధి అత్యంత అవసరమని పేర్కొన్నారు. కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు, పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు నిత్య వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనం సాగించగలరని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రజలు, కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**మల్లాపూర్ , ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ అరుంధతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారతరత్న డా. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డా. బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన మహానేత అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏడెల్ల గణేష్, లక్ష్మీపతి, వెంకట్ ప్రసాద్, వినయ్ తదితరులు, కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.





## బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు

**నాచారం, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ హెచ్ఎం టీ నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్‌లో డా. బి.ఆర్. అంబేద్కర్ సామాజిక సంక్షేమం ఆధ్వర్యంలో డా. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షులు ఎం. సంజన్న, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ మరియు డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, వారి ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మెడల మల్లికార్జున్ గౌడ్, కె. రామ్ బాబు, డా. రమేష్, వెంకటేశ్వర్ రెడ్డి, మేకల ముత్యం రెడ్డి, అషు, మహేష్ యాదవ్, మురళి, మారయ్య, రాజు బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున నగర్‌లో హిందూ సమ్మేళన ఉత్సవ సమితి ఏర్పాటు

- ఏప్రిల్ 26న శుభోదయ కాలనీలో సమ్మేళనం
- 15కి పైగా కాలనీల ప్రతినిధులతో కార్యవర్గం ఎంపిక

**కుషాయిగూడ, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలో హిందూ సమ్మేళన ఉత్సవ సమితి కార్యవర్గాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు హిందూ ఐక్యతను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో, నాగార్జున నగర్ కాలనీతో పాటు 15కి పైగా కాలనీలు కలిసి ఈ నెల 26న శుభోదయ కాలనీలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం నేపథ్యంలో ఈ సమితి ఏర్పాటైంది.ఈ సమితిలో అన్ని కాలనీల నుంచి ప్రతినిధులకు స్థానం



కల్పించారు. సమితి అధ్యక్షుడిగా మదిర వెంకట రాంబాబు, ఉపాధ్యక్షులుగా కంచు గంట్ల మల్లేశ్, భాస్కర్ పటేల్, కృష్ణ ప్రసాద్, కార్యదర్శిగా భట్టిప్రోలు సూర్యప్రకాష్, సహ కార్యదర్శులుగా శంకర్ రెడ్డి, తూతిక శివ, అరుణ్, కేశవ్, కె. యశ్వంత్ సాగర్, కోశాధికారిగా జయకృష్ణ ఎన్నికయ్యారు. సభ్యులుగా కృష్ణ యాదవ్, బలగం మల్లేశ్, కుమారి, కనకయ్య ముదిరాజ్, నల్లోల కనకయ్య, సురేశ్ గుప్తా, రాజన్న, శ్రీనివాస్, భాస్కర చారి, బాలకృష్ణ చారి, నరసింహా రెడ్డి తదితరులు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా వాసవీ శివా నగర్‌లోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అధ్యక్షుడు మదిర వెంకట రాంబాబు మాట్లాడుతూ, రాబోయే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కాలనీ నుంచి అధిక సంఖ్యలో హిందూ కుటుంబాలు పాల్గొనేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు.ధర్మంపై అవగాహన పెంపొందించడానికి ఈ సమ్మేళనం తొలి అడుగుగా నిలుస్తుందని, పార్టీలకు, కులాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు. అనంతరం ఇతర సమితి సభ్యులు కూడా తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.



## ఎర్రజెండా ప్రజలది అది పేదల ఆశలు పోరాటాల ప్రతీక

– సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** త్యాగాలకు, పోరాటాలకు కేంద్రంగా నిలిచిన సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పిలుపునిచ్చారు. ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామంలో సిపిఐ నాయకులు ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన నాయకులు ఎన్నో కష్టాలు, నిర్బంధాలు ఎదుర్కొన్నారని తెలిపారు. సమానత్వ సమాజం కోసం, పేదల హక్కుల సాధన కోసం సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు.

భూ సంస్కరణలు అమలు చేయాలని, "దున్నేవానికి భూమి" అనే నినాదంతో సిపిఐ లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఉందన్నారు. తెలంగాణలో నైజాం పాలనలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటంలో సిపిఐ కీలక పాత్ర పోషించి వేలాది గ్రామాలను విముక్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని పేర్కొన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు మరింత తీవ్రంగా మారాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం వల్ల పేదలకు విద్య, వైద్యం అందని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటాలు మరింత బలోపేతం అవుతాయని, ప్రజలు సహకరించి విరాళాలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మండల కార్యదర్శి రాజ్‌కుమార్, కామెర వెంకటరమణ, నిమ్మల మనోహర్, తండ ముండయ్య, సర్పంచ్ కర్రె లక్ష్మి, సూర మొగిలి మాధవరావు, గడ్డం లలిత, కర్రె రాజు తదితరులు పాల్గొన్నారు.





## ఈసీఐఎల్ చౌరస్తాలో భ్రమరాంబ ఫుడ్ కోర్ట్ ప్రారంభం

- యువత వ్యాపారాల్లో ముందుండాలి
- నాణ్యతా సేవలపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టి

**కుషాయిగూడ, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ లోని ఈసీఐఎల్ చౌరస్తాలో భ్రమరాంబ ఫుడ్ కోర్ట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో ముందుండాలని, ముఖ్యంగా వ్యాపార రంగంలో నాణ్యతా ప్రమాణాలను పాటించడం ఎంతో ముఖ్యమని సూచించారు.ఫుడ్ కోర్ట్ వంటి వ్యాపార కేంద్రాలు వినియోగదారులకు పరిశుభ్రతతో కూడిన రుచికరమైన ఆహారం అందించాలని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం ద్వారా వ్యాపార అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఫుడ్ కోర్ట్ నిర్వాహకులు సాయి దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, కుమారస్వామి, పాండాల శివకుమార్ గౌడ్, రహీం, తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి, పోలూరి నాగార్జున, పిల్లి సాయిరాం, మల్లికార్జునరావు, కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## హుజరాబాద్ సిఎస్ఐ చర్చిలో భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

- హల్లెలూయ గీతాలతో నగరం మార్మోగింది

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** హుజరాబాద్ పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం రెవరెండ్ ఈసంపల్లి జాన్ బాబు పాస్టర్ ఆధ్వర్యంలో జరిగింది. యేసుక్రీస్తు ప్రభువు శుక్రవారం సిలువ వేయబడి, మూడవ దినమైన ఆదివారం సమాధి నుండి లేచి పునరుత్థానుడైన సందర్భంగా విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు నిర్వహించారు. బైబిల్ సందేశాల ప్రకారం యేసు ప్రభువు మానవాళి రక్షణ కోసం పాప విమోచనార్థం పునరుత్థానం చెందినారని పాస్టర్ సందేశం ఇచ్చారు.

ఈ సందర్భంగా తెల్లవారుజామున 5 గంటలకు అంబేద్కర్ కూడలి వద్ద భక్తులు "హల్లెలూయ" నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఉమెన్స్ చైర్మన్ విజయమ్మతో పాటు చర్చికి చెందిన కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కీర్తనలు, ప్రార్థనలు, బైబిల్ వాక్యాలతో యేసుక్రీస్తు పునరుత్థానాన్ని స్మరించుకుంటూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో అనేక మంది విశ్వాసులు పాల్గొని, యేసుక్రీస్తు ప్రభువు సిలువను జయించి సమాధి నుండి లేచిన గొప్ప సందేశాన్ని స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు



# కుషాయిగూడ డిపోలో ఘనంగా డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

_టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహణ
– సమాన సమాజ స్థాపనకు ఆయన కృషి అపారమని ప్రశంసలు

కుషాయిగూడ, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు)

కుషాయిగూడ డిపోలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి



పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, దళితుల సంక్షేమానికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. సమాన సమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని అన్నారు.సుమారు 40 సంవత్సరాల పాటు పార్లమెంట్ మరియు శాసనసభల్లో వివిధ హోదాల్లో పనిచేసి బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన విశేష సేవలు అందించారని తెలిపారు. రాజ్యాంగంలోని హక్కులను వినియోగించి సామాజిక న్యాయం సాధనలో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా ఆయన నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, వెల్ఫేర్ మెంబర్ రాములు, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ సెక్రెటరీ పండరి, కౌసల్య, నర్సింగరావు, ఆనంద్, హరీష్, సాయిరాం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పి.వి.స్మారక మ్యూజియం సందర్శించిన స్మార్ట్ కిట్టి సభ్యులు

భీమదేవరపల్లి, ఏప్రిల్ 5(తెలంగాణ ముచ్చట్లు):

"భారత రత్న" మాజీ ప్రధాని దివంగత పి.వి. నరసింహారావు స్మారక మ్యూజియాన్ని ఆదివారం వరంగల్‌కు చెందిన స్మార్ట్ కిట్టి సభ్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వంగరలో ఏర్పాటు చేసిన ఈ మ్యూజియంలో ప్రదర్శించిన పి.వి. జీవితానికి సంబంధించిన అరుదైన ఫోటోలు, పత్రాలు, వస్తువులను వీక్షించి సభ్యులు మంత్రముగ్ధులయ్యారు. పి.వి.కి సంబంధించిన చిత్రాలతో కుటుంబ సభ్యులు సెల్ఫీలు దిగుతూ విదేశాల్లో ఉన్న తమ పిల్లలకు పంపిస్తూ ఆనందాన్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా పి.వి. తనయుడు, పి.వి.



గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పి.వి. ప్రభాకర్ రావు ఏర్పాటు చేసిన ఈ మ్యూజియం ప్రాముఖ్యతను సభ్యులు కొనియాడారు. మ్యూజియం బాధ్యులు లక్ష్మీకాంత్ రావు మ్యూజియంలోని వివిధ ఎగ్జిబిట్ల ప్రాముఖ్యతను వివరించారు. పి.వి. సోదరుడి కుమారుడు, కిట్టి సభ్యుడు పి.వి. మదన్ మోహన్ మాట్లాడుతూ, వంగర గ్రామంతో పి.వి.కి ఉన్న అనుబంధం, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, భారత ప్రధానిగా దేశానికి అందించిన సేవలను వివరించారు. పి.వి. జాతికి చేసిన సేవలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ మ్యూజియాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖ న్యాయవాది వద్దిరాజు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, పి.వి. ముఖ్యమంత్రిగా చేపట్టిన భూ సంస్కరణలు దేశవ్యాప్తంగా ఖ్యాతి గడించాయని, వందలాది ఎకరాల భూమిని దానం చేసిన సంస్కర్తగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. దేశ ప్రధానిగా చేసిన ఆర్థిక సంస్కరణల ప్రభావం నేటికీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపార వేత్తలు, ఉద్యోగులు దయాకర్, రవిందర్, విద్యాధర్, తిరుపతి రెడ్డి, సూర్యప్రకాశ్, వంగర గ్రామస్తులు వెంకటరెడ్డి, మొండయ్య, బుచ్చిరెడ్డి మల్లారెడ్డి, సుమన్, సతీష్ రెడ్డి, సురేశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు

భీమదేవరపల్లి ఏప్రిల్ 5(తెలంగాణ ముచ్చట్లు)

భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద భారతదేశ మాజీ ఉప ప్రధాన మంత్రి, సమతా వాది డాక్టర్ బాబు జగజీవన్ రామ్ గారి 119 వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భీమదేవరపల్లి మండల మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కొలుగూరి రాజు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగజీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని, శ్రమజీవుల కోసం లేబర్ కార్డులు, ప్రమాద బీమా, ఆస్పత్రి ఖర్చుల కోసం ఆర్థిక సహాయం వంటి పథకాలకు కృషి చేశారని తెలిపారు. అలాగే రిజర్వేషన్లు కొనసాగేందుకు పోరాటం చేసిన నాయకుల్లో ఆయన




ముఖ్యస్థానంలో నిలిచారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, ప్రముఖ రాజకీయవేత్తగా డాక్టర్ బాబు జగజీవన్ రామ్ దేశానికి విశేష సేవలు అందించారని, భారత పార్లమెంట్‌లో దాదాపు 40 సంవత్సరాలు వివిధ కీలక పదవులు నిర్వహించి ఉప ప్రధానిగా కూడా సేవలందించారని కొనియాడారు. జయంతి సందర్భంగా ముల్కనూర్ సుధాకర్ నర్సింగ్ హోమ్ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, మాజీ సర్పంచ్ వంగ రామచంద్రం, మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు మాడుగుల ఈశ్వరయ్య, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి, గజ్జల సురేష్, అంబాల చక్రపాణి, రేణిగుంట్ల బిక్షపతి, ఎల్తూరి ప్రేమ్ రాజ్, బొల్లంపల్లి కాంతారావు, తూముల సదానందం, తాళ్లపల్లి ఐలయ్య, కొమ్ముల నగేష్, కొమ్ముల రవీందర్, మాడుగుల గోపి, మాడుగుల బాబు, బొల్లంపల్లి ప్రకాష్, మాడుగుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.





# పదవ తరగతి పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి..

–జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ -05(తెలంగాణ ముచ్చట్లు)

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతిపెద్ద బహుమతి అని, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

ఆదివారం ఖమ్మం అర్బన్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలను తిరుగుతూ, మౌలిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి, రికార్డు రిజిష్టర్ల ను పరిశీలించారు. కామన్ మెనూ ప్రకారం ఆదివారం విద్యార్థులకు అందించుటకు వండుతున్న ఆహారాన్ని బగారా రైస్, మటన్ కూరను పరిశీలించారు. పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా ఇంకుడుగుంతను ఏర్పాటు చేయాలని, గ్రౌండ్ స్థలంను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటించి పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి, మెస్ కమిటీ వివరాలు అడిగి తెలుసుకుని, కమిటీ సమావేశాలు నియమితంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని , మెనూకు అనుగుణంగా నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి గది సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఇప్పటి వరకు వ్రాసిన పరీక్షల వివరాలను అడిగి వారి చదువు, లక్ష్యాలు, ఆశయాల గురించి తెలుసుకుని, చదువును ఇష్టంతో చదివి భవిష్యత్ లో ఉన్నత స్థాయికి చేరుకొని మీ తల్లిదండ్రులకు, మన జిల్లాకు మంచి పేరు తేవాలని, మరో రెండు ఎగ్జామ్స్ ఏలాంటి భయం, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువు పై దృష్టి పెట్టి పరీక్షలకు హాజరు కావాలని, ఉన్న మరో రెండు పరీక్షలకు ఉన్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మనం చదువు పై నమ్మకంగా ఉంటూ పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు వస్తాయని, ఈసారి పరీక్షలు నెల రోజుల పాటు నిర్వహిస్తున్నారని, పరీక్షల మధ్య ఎక్కువ రోజుల సమయం రావడం వలన విద్యార్థులకు మంచి వెసులుబాటు కల్గిందని అన్నారు. విద్యార్దుల కెరీర్‌లో పదవతరగతి, ఇంటర్ ముఖ్యమైన దశలని, ఏకాగ్రతతో సిద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. మనకు అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ, గొప్ప స్థాయికి చేరుకోవాలని, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఒక్కో మెట్టు ఎక్కుతూ, నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని, కొన్ని సందర్భాలలో విఫలం అయిన మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తూ అనుకున్న రంగాలలో మంచి స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ అన్నారు.

మనం ఎంత సమయం చదువుతున్నాం అనే దానికంటే, ఎంత శ్రద్ధగా చదువుతున్నామనేది చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ పరీక్షలకు బాగా సన్నద్ధం కావాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు.

ప్రతి రోజు మంచి నిద్ర ఉండాలని, ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బయట ఆహారం తీసుకోవద్దని, బయట ఎక్కువ తిరగవద్దని, మంచినీరు తగినంత త్రాగాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి , జిల్లా జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ రూబీ, ఖమ్మం అర్బన్ మండల ఎంఈఓ శైలజ లక్ష్మీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక న్యాయానికి శాశ్వత దీప్తి బాబు జగ్జీవన్ రామ్

- హుజురాబాద్‌లో ఘన నివాళులు

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో అణగారిన వర్గాలకు న్యాయం చేకూర్చేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడిదల ప్రణవ్ భావోద్వేగంగా కొనియాడారు. ఆదివారం హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పూలమాలలు సమర్పిస్తూ గౌరవ నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యానంతర భారత నిర్మాణంలో బాబు జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ తొలి ఉప ప్రధానిగా, రక్షణ శాఖ మంత్రి, వ్యవసాయ రంగంలో సంస్కరణల ద్వారా రైతులకు కొత్త దిశ చూపిన నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తుందని, సమానత్వం, న్యాయం, సేవా భావం అనే విలువలను ఆయన తన ఆచరణలో చూపారని ప్రణవ్ వివరించారు. ఈ సందర్భంగా నాయకులు బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సమానత్వం సాధించేందుకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం మొత్తం గౌరవం, భావోద్వేగం, చైతన్యంతో నిండిపోయింది.



# అనారోగ్యంతో మహిళ మృతి

- కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే

పెద్దమందడి,ఏప్రిల్5(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కర్నే మల్లమ్మ భర్త మల్లయ్య అనారోగ్యంతో నిన్న సాయంత్రం మరణించారు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలిసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అంత్యక్రియల నిర్వహణ కోసం రూ. 5000/ రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, ఉప సర్పంచ్ రాములమ్మ హనుమంతు, మాజీ సర్పంచ్ సిద్దయ్య, మాజీ ఎంపిటిసి ఇందిరా లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు కావాలి కృష్ణ, షౌకత్, ఎల్లయ్య, వెంకటయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




# హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఉధృత నిరసనలు

- ప్రకృతి సంరక్షణకు ప్రజల ఐక్యత
- సిర్సపల్లి యార్డ్ రద్దుకు చెల్పూర్ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణ శివారులో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజా నిరసనలు రోజురోజుకు ఉధృతమవుతున్నాయి. ఈ క్రమంలో నిర్వహిస్తున్న దీక్షలో ఆర్యవైశ సంఘం నాయకులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. కౌన్సిలర్ గందె శ్రీనివాస్, సంఘ అధ్యక్షుడు సుద్దాల హరిశంకర్ మాట్లాడుతూ, ఓఆర్ఆర్ పక్కన ప్రకృతి సోయగాలతో అలరారుతున్న అందమైన ప్రదేశాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు విశ్రాంతి, ఆనందం కలిగేలా చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ఇదే సమయంలో సిర్సపల్లిలో ప్రతిపాదిత డంపింగ్ యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చెల్పూర్ గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన దీక్షకు సర్పంచ్ కస్తూరి, వార్డు సభ్యులు సంఘీభావం తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో సుమారు 20 కిలోమీటర్ల పరిధిలో పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని, ఆ ప్రాంతం స్మశానవాటికలా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమం రోజురోజుకు ప్రజల మద్దతు పొందుతూ, హుజురాబాద్‌లో కీలక అంశంగా మారింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వేలేరు మండలంలో మక్కల కొనుగోలు కేంద్రం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు

- తక్షణమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి
- మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు



**వేలేరు, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలంలోని రైతులు పండించిన మొక్కజొన్న (మక్కలు)కు కొనుగోలు కేంద్రం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

ఇటీవల ధర్మసాగర్ మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటికీ, వేలేరు మండలాన్ని పూర్తిగా పక్కన పెట్టడం రైతుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోందని ఆయన వివరించారు. గతంలో ఉమ్మడి ధర్మసాగర్ మండల పరిధిలో వేలేరు కేంద్రంలో కూడా కొనుగోలు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం ఆ సౌకర్యం లేకపోవడంతో రైతులు తమ పంటను ఎక్కడ అమ్మాలో తెలియక ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ధర్మసాగర్ వరకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చులు పెరగడంతో పాటు సమయం, శ్రమ వృథా అవుతోంది. ఈ పరిస్థితిని ప్రైవేట్ వ్యాపారులు ఉపయోగించుకుని తక్కువ ధరలకు మక్కలు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అందకుండా రైతులు తీవ్ర నష్టపోతున్నారని కీర్తి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

వేలేరు మండల రైతులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి, మండలంలో తక్షణమే మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పంటను కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని కోరారు. రవాణా మరియు నిల్వ సౌకర్యాల లోపం రైతులకు అదనపు భారం అవుతోందని, దీనిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు కోరారు.



# ఘనంగా ఈస్టర్ ఆరాధన




**స్టేషన్ ఘనాపూర్, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** ఘనాపూర్ (స్టేషన్) లో శివునిపల్లి, సువార్త బాప్టిస్ట్ చర్చి, లో ఈస్టర్ ఆరాధన ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాక్య పరిచర్య సంస్థ అధ్యక్షులు కె. ఎల్మర్ విక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, సమాధాన సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. సమాజంలో కలహాలు, విభేదాలు తొలగి, ప్రజలలో పరస్పర ప్రేమ, ఐక్యత, సమాధానం పెరగాలని ఆకాంక్షించారు.

స్థానిక సంఘ కాపరి రెవ. సి.హెచ్. తిమోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆరాధన కార్యక్రమంలో సంఘ పెద్దలు, యవ్వనస్తులు, స్త్రీలు విశేషంగా పాల్గొన్నారు.



# జమ్మికుంటలో జ్వలించిన జగ్జీవన్ రామ్ స్ఫూర్తి

- ఘనంగా జయంతి వేడుకలు

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట పట్టణంలో ఆదివారం మాజీ ఉప ప్రధాని, సామాజిక న్యాయానికి ప్రతీక అయిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం మొత్తం గౌరవం, భావోద్వేగం, ప్రేరణతో నిండిపోయింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిందని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, అదే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనే మనం అర్పించే నిజమైన నివాళి..

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ - 05(తెలంగాణ ముచ్చట్లు)**





బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లి, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని, ఆ మహనీయుని స్ఫూర్తితోనే మన ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

ఆదివారం భారత మాజీ ఉప ప్రధాని, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఖమ్మం నగరంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ, జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

దేశ ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడంలో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర చిరస్మరణీయమని అన్నారు. కేంద్ర మంత్రిగా ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు ఈనాటికీ పాలకులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. రక్షణ శాఖ మంత్రిగా గాని, ఇతర ఏ శాఖ బాధ్యతలు చేపట్టినా, ఆ శాఖకు సరికొత్త ఔన్నత్యాన్ని తీసుకువచ్చిన గొప్ప పరిపాలనాదక్షుడు ఆయనని డిప్యూటీ సీఎం ప్రశంసించారు.

సామాజిక మార్పు కోసం అవిరళ కృషి, దేశంలో సామాజిక సమానత్వం, మార్పు కోసం జగ్జీవన్ రామ్ అనేక పోరాటాలు చేశారని, దేశ భవిష్యత్తుకు ఆయనో దిక్సూచిలా నిలిచారని డిప్యూటీ సీఎం తెలిపారు. అత్యంత పేదరికం, వెనుకబాటుతనం నుంచి వచ్చినప్పటికీ, తన కృషితో దేశంలోనే అత్యున్నత స్థానాలకు ఎదిగారని, అధికారాన్ని అనుభవించడానికి కాకుండా, దేశ ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని ధారపోశారని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.రాజకీయాల్లోకి వచ్చే ప్రతి ఒక్కరికీ బాబు జగ్జీవన్ రామ్ జీవితం ఒక పాఠమని, ఆయనది నిరంతరం ప్రగతిశీలమైన పంథా అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రాం జీవితం ద్వారా చెప్పడం కంటే, చేతల ద్వారానే సందేశం ఇచ్చారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. పార్లమెంటేరియన్ గా, కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి విద్యతోనే సాధ్యమవుతుందని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని, ఆయన ఆశయ సాధనకు అందరం కలిసికట్టుగా పని చేయాలని, ప్రభుత్వ ఫలాలు అర్హులకు అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ అన్నారు.

అనంతరం అంబేద్కర్ భవన్ లో జరిగిన డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొని, డా. బాబు జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. వారు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని, తెచ్చిన సంస్కరణలను గుర్తు చేశారు. వారు చూపిన మార్గంలో నడిచి, వారి ఆశయ సాధన కు కృషిచేయడమే, వారికిచ్చే నివాళి అని అదనపు కలెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాసు నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఎస్సి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. జ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్లు కామా ప్రభాకర్, మారేపల్లి వెంకట నారాయణ, అధ్యక్షులు పేర్ల మధు, సంతేటి వీరభద్రం, గౌరవ అధ్యక్షులు జమ్మి వీరబాయి, పడిశాల వెంకన్న, లింగాల రవికుమార్, బచ్చలికూర వెంకటేశ్వర్లు, దాస్ మహరాజ్, తూరుగంటి రాజయ్య, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీ మేసా ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, ఉపాధ్యాయ సంఘ నాయకులు కట్టా శేఖర్, షేక్ రంజాన్, వెంకటరమణ, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా డిప్యూటీ సీఎం భట్టి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుక

- ప్రజా సంద్రమైన ఖమ్మం వైయస్సార్ కాలనీ

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 5(తెలంగాణ ముచ్చట్లు)**





రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతుల కుమారుడు సూర్య విక్రమాదిత్య, సాక్షిల వివాహ రిసెప్షన్ వేడుక ఆదివారం అశేష జనవాహిని మధ్య కనుల పండుగగా జరిగింది. నగరంలోని గ్రీన్ హిల్స్, వైయస్సార్ కాలనీ రోడ్ వేదికగా ఉదయం 10 గంటల నుండే ప్రారంభమైన ఈ శుభకార్యం సాయంత్రం వరకు అత్యంత వైభవంగా కొనసాగింది. తమ అభిమాన నాయకుడి కుటుంబ వేడుకను సొంత ఇంటి పండుగగా భావించిన కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావడంతో ఖమ్మం నగరం జనసంద్రంగా మారింది.

ఈ రిసెప్షన్ వేడుకకు ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత స్థాయి అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు హాజరై నూతన వధూవరులను దీవించారు. వీరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కీలక రాజకీయ నాయకులు, ప్రముఖులు మరియు వివిధ ప్రజాసంఘాల నాయకులు విచ్చేసి భట్టి విక్రమార్క కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఒకవైపు రాజకీయ గంభీరం, మరోవైపు అధికారుల సమక్షంతో వేదిక ప్రాంగణం కళకళలాడింది.

**లక్ష మందికి పైగా అతిథులు.. పకడ్బందీ ఏర్పాట్లు**

ముందుగా అంచనా వేసినట్లుగానే సుమారు లక్ష మందికి పైగా జనం ఈ వేడుకకు హాజరయ్యారు. ముఖ్యంగా మధిర నియోజకవర్గంలోని ప్రతి పల్లె నుండి వచ్చిన అభిమానుల కోసం భారీ ఎత్తున భోజన వసతులు కల్పించారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టగా, వేలాది వాహనాల పార్కింగ్ కోసం భారీ స్థలాలను కేటాయించారు. ఇంతటి భారీ జనసందోహం ఉన్నప్పటికీ, ఎక్కడా అసౌకర్యం కలగకుండా వాలంటీర్లు, కార్యకర్తలు పర్యవేక్షించడం విశేషం.

**ప్రజల కోసమే ఖమ్మం వేదికగా..**

గత నెల మార్చి 5న హైదరాబాద్‌లో వివాహం జరిగినప్పటికీ, తనను రాజకీయంగా పెంచి పెద్ద చేసిన నియోజకవర్గ ప్రజల మరియు స్థానిక అభిమానుల ఆశీస్సుల కోసమే ఈ కార్యక్రమాన్ని ఖమ్మంలో నిర్వహించారు. "మా కుటుంబ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను దీవించి, విందును స్వీకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు" అని భట్టి విక్రమార్క నందిని దంపతులు తెలిపారు. సామాన్య కార్యకర్త నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు అందరూ ఒకే వేదికపై పాలుపంచుకున్న ఈ వేడుక, ఖమ్మం జిల్లాలో ఒక మరపురాని స్మృతిగా నిలిచిపోయింది.





# మేడారంలో నాసిరకం అభివృద్ధి పనుల కారణంగానే బాలుడికి తీవ్ర గాయాలు

- గాయపడిని బాలుడిని పరామర్శించి రాకేష్ రెడ్డి

**హన్మకొండ,ఏప్రిల్05(తెలంగాణ ముచ్చట్లు):**

మేడారం ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనుల నిర్లక్ష్యం కారణంగా ఒక చిన్నారి జీవితంలో విషాదం చోటుచేసుకున్న ఘటన కలకలం రేపుతోంది. సమ్మక్క సారక్క తల్లి ప్రధాన పూజారి రమేష్ కుమారుడు యువిన్ ఇటీవల అక్కడ జరుగుతున్న నాసిరకం పనుల వల్ల తీవ్రంగా గాయపడిన విషయం వెలుగులోకి వచ్చింది. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న యువిన్‌ను హన్మకొండలోని గార్డియన్ ఆసుపత్రిలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. యువిన్‌కు అవసరమైన అన్ని విధాల సహాయం అందించేందుకు తాను ముందుంటానని తెలిపారు. చిన్నారి పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉండగా, వైద్యులు అవసరమైన చికిత్స అందిస్తున్నారు.

ఈ ఘటనపై స్పందించిన రాకేష్ రెడ్డి, ప్రచారాల కోసం తొందరపాటుగా చేపట్టిన పనులే ప్రమాదానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా అభివృద్ధి పనులు నిర్వహించడం అత్యంత నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భవిష్యత్‌లో ఎంతో ఎదగాల్సిన వయస్సులో ఉన్న యువిన్ ఒక పాదాన్ని కోల్పోయి, మరో కాలికి తీవ్ర గాయాలు కావడం తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు. ఆటపాటలతో గడపాల్సిన బాల్యంలో నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకోవడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# శాంతి విల్లే కాలనీలో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

**కాప్రా, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ డివిజన్ పరిధిలోని శాంతి విల్లే కాలనీలో రూ. 60 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధి తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా రవాణా సమస్యలు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. శాంతి విల్లే కాలనీలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్, కాలనీ వాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టెహ్రాన్‌పై అమెరికా భారీ వైమానిక దాడులు

- ఇరాన్ మిలిటరీ అగ్రనేతల మృతి
- ఇరాన్ సైనిక నాయకత్వంపై విరుచుకుపడ్డ అమెరికా దళాలు
- హర్మ్యూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు ట్రంప్ 48 గంటల అల్టిమేటమ్
- ప్రతికారంగా కువైట్ ఆయిల్ సెక్టార్‌పై డ్రోన్లతో దాడి చేసిన ఇరాన్



టెహ్రాన్, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు): పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత ఉధృతమయ్యాయి. అమెరికా మరియు ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై తమ దాడులను ఉధృతం చేస్తూనే ఉన్నాయి. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా సైన్యం భారీ స్థాయిలో వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడులు ఇరాన్ మిలిటరీ సామర్థ్యాన్ని దెబ్బతీసే లక్ష్యంతో జరిగినట్లు సమాచారం. ఈ ఆపరేషన్‌లో ఇరాన్ సైన్యానికి చెందిన పలువురు అగ్రశ్రేణి మిలిటరీ నాయకులు ప్రాణాలు కోల్పోయారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ధృవీకరించారు. ఈ పరిణామం ఇరాన్ రక్షణ వ్యవస్థకు పెద్ద దెబ్బగా అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అధ్యక్షుడు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా ఈ దాడులకు సంబంధించిన వివరాలను ప్రపంచానికి వెల్లడించారు. టెహ్రాన్‌పై జరిగిన దాడుల్లో ఇరాన్ సైన్యాన్ని బలహీనంగా, అనాలోచితంగా నడిపిస్తున్న కీలక సైనిక నేతలు హతమయ్యారని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి కొన్ని యుద్ధ విమానాల వీడియోలను కూడా ఆయన విడుదల చేయడం సంచలనం సృష్టించింది. అయితే, మరణించిన ఆ నేతల పేర్లు లేదా వారి హోదాల గురించి స్పష్టమైన వివరాలను మాత్రం అమెరికా ఇంకా బహిర్గతం చేయలేదు. ఈ దాడులపై ఇరాన్ ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక స్పందన రాకపోవడం గమనార్హం. మరోవైపు, అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధి విషయంలో ట్రంప్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు. వచ్చే 48 గంటల్లోగా ఈ జలసంధిని నిరంతరాయ నౌకాయానం కోసం తెరవాలని ఇరాన్‌కు అల్టిమేటమ్ ఇచ్చారు. ఒకవేళ ఇరాన్ ఈ హెచ్చరికను బేఖాతరు చేస్తే, ఆ దేశంపై మరింత తీవ్రస్థాయిలో విరుచుకుపడతామని ఆయన హెచ్చరించారు. ఈ వార్నింగ్ ఇచ్చిన కొద్దిసేపటికే అమెరికా తన దాడులను ప్రారంభించడం గమనార్హం. ఇదే క్రమంలో, ఇరాన్ భూభాగంలో చిక్కుకున్న తమ దేశ పైలట్‌ను సురక్షితంగా రక్షించేందుకు అమెరికా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ విజయవంతమైందని వైట్ హౌస్ ప్రకటించింది.

అమెరికా దాడులకు ప్రతికారంగా ఇరాన్ కూడా పొరుగు దేశాలను లక్ష్యంగా చేసుకుంటోంది. తాజాగా కువైట్‌పై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. కువైట్‌లోని వ్యూహాత్మకమైన 'షువైఖ్ ఆయిల్ సెక్టార్ కాంప్లెక్స్' పై ఇరాన్ డ్రోన్ దాడులు చేయడంతో అక్కడ భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇంధన క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ప్రపంచ చమురు మార్కెట్‌ను దెబ్బతీయాలని ఇరాన్ భావిస్తోంది. ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతుండటంతో పశ్చిమాసియాలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఉత్కంఠ భరితమైన పరిస్థితి నెలకొంది. ఈ యుద్ధం ఇతర దేశాలకు కూడా పాకే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# ఆగ్రాలో భర్త దారుణ హత్య: భార్య, ప్రియుడు అరెస్ట్

- వివాహేతర సంబంధం నేపథ్యంలో ఘాతుకం
- మద్యం సీసా క్యూఆర్ కోడ్‌తో దొరికిన నిందితులు
- పచ్చబొట్టు ఆధారంగా మృతదేహం గుర్తింపు



ఆగ్రా, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు): ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లా సయ్యాన్ ప్రాంతంలో ఒక మహిళ తన వివాహేతర సంబంధానికి అడ్డంగా ఉన్నాడన్న కారణంతో, ప్రియుడితో కలిసి భర్తను హత మార్చిన ఉదంతం కలకలం రేపింది. ఏప్రిల్ 1వ తేదీన సగం కాలిన స్థితిలో ఉన్న ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు మృతదేహం ముఖం గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో వివరాల సేకరణ సవాల్‌గా మారింది. అయితే మృతుడి ముంజేతిపై ఉన్న పచ్చబొట్టును క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, అది లోకేంద్ర అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసును ఛేదించేందుకు పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. నేర స్థలంలో లభ్యమైన మద్యం సీసాలు, కొన్ని కాగితపు ముక్కలను పోలీసులు కీలక ఆధారాలుగా సేకరించారు. ఆ కాగితపు ముక్కలు ఒక పండ్ల వ్యాపారి వినియోగించేవని గుర్తించిన పోలీసులు, మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అవి ఎక్కడ కొనుగోలు చేశారో కనుగొన్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా, నిందితుల కదలికలు స్పష్టంగా రికార్డయ్యాయి. మృతుడి సోదరుడు కూడా లోకేంద్ర చివరిసారిగా మహేంద్ర ప్రజాపతితో కలిసి వెళ్లినట్లు చెప్పడంతో పోలీసులు ఆ దిశగా విచారణ జరిపారు. పోలీసుల విచారణలో లోకేంద్ర భార్యకు, మహేష్ ప్రజాపతికి మధ్య గత కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉన్నట్లు తేలింది. ఈ విషయం ఇటీవల లోకేంద్రకు తెలియడంతో దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. తన సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని భావించిన భార్య, ప్రియుడు మహేష్‌తో కలిసి భర్తను వదిలించుకోవాలని కుట్ర పన్నింది. పథకం ప్రకారం, ఏప్రిల్ 1న లోకేంద్ర ఇంటి నుండి బయటకు రాగానే భార్య తన ప్రియుడికి ఫోన్ చేసి సమాచారం అందించింది. వెంటనే మహేష్ తన స్నేహితుడు ధర్మవీర్‌తో కలిసి లోకేంద్రను మార్గమధ్యలో కలిసి, మద్యం సేవించడానికి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. మద్యం సేవించి లోకేంద్ర స్పృహ కోల్పోయిన సమయంలో, మహేష్ మరియు ధర్మవీర్ కలిసి అతడి గొంతు నులిమి హత్య చేశారు. హత్య చేసిన అనంతరం ఎటువంటి ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు, మృతదేహంపై పెట్రోల్ పోసి గడ్డి కప్పి నిప్పంటించారు. మృతదేహం సగం కాలిన తర్వాత నిందితులు అక్కడి నుండి పరారయ్యారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుల మూలాలను కనిపెట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వివాహేతర సంబంధం కారణంగానే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు వారు పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించారు. ఈ క్రూరమైన హత్యకు పాల్పడిన లోకేంద్ర భార్య, ప్రియుడు మహేష్ ప్రజాపతి, మరియు అతడికి సహకరించిన ధర్మవీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వారిని స్థానిక కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి రిమాండ్ విధించడంతో ముగ్గురు నిందితులను జైలుకు తరలించారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు, అక్రమ సంబంధాలు ఎలా ప్రాణాలు తీస్తున్నాయో ఈ ఘటన మరోసారి నిరూపించింది. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన పోలీస్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# చేప రూపంలో వచ్చిన మృత్యువు


- జాలరి గొంతులో చేప ఇరుక్కుని మృతి
- నోటితో చేపను పట్టుకోబోయి ప్రాణాలు కోల్పోయిన యువకుడు
- ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో విషాదకర ఘటన
- వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణం బంధువుల ఆందోళన



మయూర్‌భంజ్, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు): ఒడిశా రాష్ట్రంలోని మయూర్‌భంజ్ జిల్లా దిఘి గ్రామంలో ఒక వింతైన మరియు అత్యంత విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. చేపలు పట్టడమే వృత్తిగా జీవిస్తున్న అవినాష్ బిజులీ అనే యువ జాలరి, తాను పట్టిన చేప కారణంగానే ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సాధారణంగా రోజువారీ పనుల్లో భాగంగానే అతడు చేపలు పట్టేందుకు స్థానిక చెరువుకు వెళ్లాడు. వల వేసి చేపలను బయటకు తీస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ఒక చిన్న పొరపాటు అతడి నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ ఊహించని పరిణామంతో అవినాష్ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

గత శుక్రవారం మధ్యాహ్నం అవినాష్ గ్రామ సమీపంలోని చెరువులో వల వేసి చేపలను పడుతున్నాడు. వలలో కొన్ని చేపలు చిక్కగా, వాటిని బయటకు తీసే క్రమంలో ఒక చేపను పట్టుకుని తన నోటితో అదిమి పెట్టుకున్నాడు. వలలో ఉన్న మిగిలిన చేపలను రెండు చేతులతో బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, నోటిలో ఉన్న చేప ఒక్కసారిగా జారి అతడి గొంతులోకి దూసుకెళ్లింది. ఆ చేప గొంతులో ఇరుక్కుపోవడంతో అతడికి శ్వాస తీసుకోవడం కష్టతరమైంది. చేప లోపలికి వెళ్లక, బయటకు రాక గొంతులోనే అడ్డుపడటంతో అవినాష్ ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. అవినాష్ పరిస్థితిని గమనించిన తోటి జాలర్లు మరియు స్థానికులు వెంటనే స్పందించి అతడిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకునే సమయానికి అవినాష్ పరిస్థితి విషమంగా మారింది. అత్యవసర విభాగంలో వైద్యులు అతడి గొంతులో ఉన్న చేపను బయటకు తీసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, ఆ చేప ముళ్ల వంటి నిర్మాణం కారణంగా గొంతులో బలంగా కూరుకుపోవడంతో దానిని తొలగించడం వైద్యులకు కష్టతరమైంది. వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలోనే శ్వాస అందక అవినాష్ ఆసుపత్రిలోనే కన్నుమూశాడు.

అవినాష్ మరణవార్త విన్న కుటుంబ సభ్యులు మరియు బంధువులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఆసుపత్రి వైద్యులు సకాలంలో స్పందించి చికిత్స అందించలేదని, వారి నిర్లక్ష్యం వల్లే అవినాష్ ప్రాణాలు పోయాయని ఆరోపిస్తూ ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. వైద్యులు త్వరగా స్పందించి ఉంటే చేపను తీసి ప్రాణాలు కాపాడే అవకాశం ఉండేదని వారు వాపోయారు. ఆసుపత్రి ప్రాంగణంలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి వారిని శాంతింపజేశారు. ఈ ఘటన జాలర్ల వృత్తిలో ఉండే ప్రమాదాలను మరియు అప్రమత్తత అవసరాన్ని మరోసారి గుర్తు చేసింది. పట్టుకున్న చేపలను నోటితో పట్టుకోవడం వంటి అలవాట్లు ప్రాణాంతకంగా మారుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక సామాన్య జాలరి చేప రూపంలో వచ్చిన మృత్యువుకు బలికావడం ఆ గ్రామంలో పెద్ద చర్చకు దారితీసింది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు. అవినాష్ మృతితో దిఘి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## బంగారం, వెండి ధరలు స్థిరంగా..

హైదరాబాద్, ఏప్రిల్ 5 (తెలంగాణ ముచ్చట్లు):
గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు పెద్దగా మార్పులు లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడులైన బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పసిడి ధరలు ఉన్నత స్థాయిలోనే కొనసాగుతున్నాయి.
ఈ రోజు ఉదయం పరిస్థితి ప్రకారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,50,930 వద్ద ఉంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,38,350గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,51,080కు చేరుకోగా, 22 క్యారెట్ల ధర రూ.1,38,500గా ఉంది. హైదరాబాద్, విజయవాడ, ముంబై, కోల్‌కతా వంటి నగరాల్లో కూడా దాదాపు ఇదే స్థాయిలో ధరలు కొనసాగుతున్నాయి. చెన్నైలో మాత్రం స్వల్పంగా ఎక్కువగా ఉండగా, బెంగళూరులో 22 క్యారెట్ల ధర కొద్దిగా అధికంగా నమోదైంది.
ఇక వెండి ధర కూడా స్థిరంగానే ఉంది. ప్రస్తుతం కిలో వెండి ధర సుమారు రూ.2.50 లక్షల నుంచి రూ.2.55 లక్షల మధ్య కదలాడుతోంది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, కేరళ వంటి ప్రాంతాల్లో వెండి ధర రూ.2,55,000 వద్ద ఉండగా, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాల్లో రూ.2,50,000గా నమోదైంది.
మొత్తానికి, అంతర్జాతీయ పరిణామాలు మరియు పెట్టుబడిదారుల ధోరణి కారణంగా బంగారం, వెండి ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. అయితే రాబోయే రోజుల్లో గ్లోబల్ పరిస్థితుల ప్రభావంతో ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

# గ్యాస్ కష్టాలకు చెక్

- అడ్రస్ ప్రూఫ్ లేకుండానే 5 కేజీల సిలిండర్
- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- వలస కార్మికుల సౌకర్యార్థం ఐదు కేజీల ఎల్‌పీజీ విక్రయాలు
- చిరునామా ధ్రువీకరణ పత్రం లేకపోయినా సిలిండర్ పొందే అవకాశం




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశంలో ఇంధన మరియు గ్యాస్ కొరత ఏర్పడవచ్చనే ఆందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల లభ్యతపై సామాన్యులు, ముఖ్యంగా వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల అవసరాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఒక ఉపశమనకరమైన ప్రకటన చేసింది. నిత్యం పనుల నిమిత్తం ప్రాంతాలు మారుతూ ఉండే అసంఘటిత రంగ కార్మికులు మరియు విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా ఐదు కేజీల ఎల్‌పీజీ సిలిండర్ల విక్రయ నిబంధనలను సరళతరం చేసింది. దీనివల్ల సామాన్యులకు కొంత ఊరట లభించనుంది.

ప్రస్తుత నిబంధనల ప్రకారం గ్యాస్ కనెక్షన్ పొందాలంటే స్థానిక చిరునామా ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అయితే, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులకు ఈ పత్రాలు సమర్పించడం పెద్ద సవాల్‌గా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఎటువంటి అడ్రస్ ప్రూఫ్ లేకుండానే ఐదు కేజీల చిన్న సిలిండర్లను నేరుగా విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే తక్షణమే సిలిండర్ పొందే వీలు కలుగుతుంది. యుద్ధం కారణంగా సరఫరాలో అంతరాయం కలగవచ్చనే భయాలను తొలగించేందుకు ప్రభుత్వం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. గణాంకాల ప్రకారం, మార్చి 23 నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా సుమారు 5.7 లక్షల చిన్న సిలిండర్లను ఎటువంటి చిరునామా ధ్రువీకరణ పత్రాలు లేకుండానే విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. విదేశీ పరిణామాల వల్ల గ్యాస్ ధరలు పెరిగినా లేదా కొరత ఏర్పడినా, సామాన్య ప్రజలకు నిత్యావసర ఇంధనం అందకుండా పోకూడదనే లక్ష్యంతో ఈ విక్రయాలు వేగవంతం చేశారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నివసించే ఒంటరి వ్యక్తులకు మరియు చిన్న కుటుంబాలకు ఈ ఐదు కేజీల సిలిండర్లు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవ వల్ల నల్లబజారులో గ్యాస్ విక్రయాలకు కూడా అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం దేశీయ ఇంధన నిల్వలపై పడకుండా కేంద్ర చమురు సంస్థలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని అన్ని చమురు విక్రయ కంపెనీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అడ్రస్ ప్రూఫ్ లేని వారికి సైతం గ్యాస్ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రభుత్వం ప్రజా రవాణా మరియు గృహ అవసరాలకు అవసరమైన ఇంధన భద్రతను కల్పిస్తోంది. ఈ పథకం కింద మరిన్ని సిలిండర్లను అందుబాటులోకి తెచ్చేందుకు గ్యాస్ రీఫిల్లింగ్ ప్లాంట్లు ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది.

# హర్మ్యూజ్ జలసంధి గుండా భారత్ నౌకల ప్రయాణం

- ఇంధన సరఫరాపై ధీమా
- పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్న గ్యాస్, చమురు రవాణా
- హర్మ్యూజ్ జలసంధిని సురక్షితంగా దాటిన గ్రీన్ ఆశా ఎల్‌పీజీ నౌక
- ఇరాన్ ఆంక్షల మధ్య భారత్ సహా మిత్రదేశాల నౌకలకు మాత్రమే అనుమతి




న్యూఢిల్లీ, ఏప్రిల్ 05 (తెలంగాణ ముచ్చట్లు): పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ, భారత దేశానికి అవసరమైన ఇంధన సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా భారత నౌకలు నిరంతరాయంగా తమ ప్రయాణాన్ని సాగిస్తున్నాయి. తాజాగా 'గ్రీన్ ఆశా' అనే భారత ఎల్‌పీజీ నౌక హర్మ్యూజ్ జలసంధిని అత్యంత సురక్షితంగా దాటింది. శనివారం 'గ్రీన్ శాన్వి' అనే నౌక ఈ మార్గాన్ని దాటగా, ఆదివారం గ్రీన్ ఆశా అదే బాటలో ప్రయాణించింది. సంక్షోభం మొదలైనప్పటి నుండి ఈ మార్గం గుండా వెళ్ళిన 9వ భారత నౌకగా గ్రీన్ ఆశా నిలవడం విశేషం.

ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ ఈ జలసంధిపై తన పట్టును మరింత బిగించింది. ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా జరిగే ఈ కీలక మార్గంలో ఇరాన్ ఆంక్షలు విధించినప్పటికీ, భారత్ వంటి మిత్రదేశాల నౌకలను మాత్రం అనుమతిస్తోంది. భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నప్పటికీ, దేశీయ ఇంధన అవసరాల దృష్ట్యా భారత్ ఈ మార్గంపైనే ప్రధానంగా ఆధారపడుతోంది. గ్రీన్ ఆశా కంటే ముందు కూడా అనేక భారత నౌకలు ఈ ప్రమాదకర ప్రాంతాన్ని విజయవంతంగా దాటి భారత తీరాలకు చేరుకున్నాయి. బీడబ్ల్యూ టైర్, బీడబ్ల్యూ ఎల్మ్ వంటి నౌకలు సుమారు 94,000 టన్నుల కార్గోను ఇప్పటికే రవాణా చేశాయి. గడిచిన మార్చి నెలలో కూడా భారత ఇంధన భద్రతకు భరోసా ఇస్తూ ఎంటీ శివాలిక్, ఎంటీ నందాదేవి అనే ట్యాంకర్లు భారీ ఎత్తున ఎల్‌పీజీని గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టులకు చేరవేశాయి. వీటితో పాటు ముడి చమురు రవాణా కూడా నిరంతరాయంగా సాగుతోంది. 'జగ్ లాడ్కి' అనే ఆయిల్ ట్యాంకర్ యూఏఈ నుంచి 80,000 టన్నుల ముడి చమురును ముంద్రా పోర్టుకు తీసుకురాగా, 'జగ్ ప్రకాశ్' నౌక ఒమన్ నుంచి ఆఫ్రికా మార్కెట్లకు గ్యాసోలిన్‌ను విజయవంతంగా చేరవేసింది. అంతర్జాతీయ స్థాయిలో యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ భారత నౌకాదళం మరియు దౌత్య సంబంధాల సహకారంతో ఈ రవాణా సాఫీగా సాగుతోంది. దేశీయంగా ఇంధన కొరత ఏర్పడకుండా ఉండేందుకు ఈ ప్రమాదకర మార్గంలో ప్రయాణం అనివార్యమని ప్రస్తుత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ ఒత్తిళ్లు, మరోవైపు భద్రతా సవాళ్లు ఎదురవుతున్నా, భారత నౌకలు ధైర్యంగా ముందుకు సాగుతుండటం గమనార్హం. ఇరాన్‌తో ఉన్న సత్సంబంధాల కారణంగానే భారత నౌకలకు ఈ జలసంధిలో మార్గం సుగమం అవుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇంధన సరఫరాలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ పరిణామాలు దేశంలోని గ్యాస్ మరియు పెట్రోల్ సరఫరాపై ప్రజల్లో ఉన్న ఆందోళనలను కొంతవరకు తగ్గించే అవకాశం ఉంది.ఈ

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# మేఘాంశ్ శ్రీహరి కొత్త సినిమా ప్రారంభం

స్వర్గీయ నటుడు రియల్ స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆస్మాన్' ఘనంగా ప్రారంభమైంది. శనివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకకు టాలీవుడ్‌కు చెందిన పలువురు యువ హీరోలు, ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమం సినీ వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
శ్రీ క్లీంకార సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రం, ప్రొడక్షన్ నంబర్ వన్‌గా రూపుదిద్దుకుంటోంది. ముహూర్తపు సన్నివేశానికి మెగా కుటుంబానికి చెందిన సాయి దుర్గ తేజ్ క్లాప్ కొట్టగా, యువ హీరో సందీప్ కిషన్ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాతగా, నటిగా గుర్తింపు పొందిన నిహారిక కొణిదెల స్క్రిప్ట్‌ను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్, రోషన్ కనకాల, తిరువీర్, నార్నే నితిన్, నిర్మాత రామ్ తాళ్లూరి తదితరులు పాల్గొని మేఘాంశ్ శ్రీహరికి అభినందనలు తెలిపారు. యువ హీరోల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా మేఘాంశ్ శ్రీహరి మాట్లాడుతూ, "నా 'ఆస్మాన్' సినిమా ప్రారంభోత్సవానికి విచ్చేసిన సాయి అన్న, నిహారిక అక్క, సందీప్ అన్నతో పాటు అందరికీ కృతజ్ఞతలు. నిర్మాతలు వెంకటేష్ గారు, శ్రీకాంత్ గార్లతో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు రామ్ నందన్ చెప్పిన కథ చాలా ప్రత్యేకంగా ఉంది. మేము ఖచ్చితంగా మంచి సినిమా తీస్తామని నమ్మకం ఉంది" అని అన్నారు. దర్శకుడు రామ్ నందన్ మాట్లాడుతూ, "తెలుగులో ఇది నా తొలి అవకాశం. నన్ను నమ్మి ఈ బాధ్యత ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు. మేఘాంశ్‌తో పని చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్రాన్ని మూడు షెడ్యూల్స్‌లో పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ప్రేక్షకులను ఆకట్టుకునే థ్రిల్లర్ కథతో ఈ సినిమా రూపొందుతుంది" అని తెలిపారు.
ఈ సినిమా కథ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ నేపథ్యంలో ఉండబోతుందని చిత్రబృందం తెలిపింది. కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందిస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, 'ఆస్మాన్' సినిమాతో మేఘాంశ్ శ్రీహరి మరోసారి తన నటనను నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నాడు. వరుసగా మంచి కథలు ఎంచుకుంటూ ముందుకు సాగితే, తండ్రి శ్రీహరి లాంటి గుర్తింపును సంపాదించగలడని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సినిమా అతని కెరీర్‌లో కీలక మలుపు తిప్పుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# జైలర్ 2 షూటింగ్ తుది దశలో.. విడుదలపై త్వరలో క్లారిటీ!

చెన్నై, ఏప్రిల్ 5 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న భారీ చిత్రం 'జైలర్ 2' షూటింగ్ ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. మొదటి భాగం ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఈ సీక్వెల్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కోలీవుడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో షూటింగ్ జరుపుకుంటోంది.
తాజాగా మీడియాతో మాట్లాడిన రజినీకాంత్.. సినిమా షూటింగ్ త్వరలోనే పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం క్లైమాక్స్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా విడుదల తేదీని కూడా మేకర్స్ త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారని చెప్పారు.



ముందుగా వచ్చిన సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2026 జూన్ 12న విడుదల చేయాలని ప్లాన్ చేసినట్లు తెలిసింది. అయితే తాజా టాక్ ప్రకారం ఇండిపెండెన్స్ డే వీకెండ్‌ను టార్గెట్ చేస్తూ విడుదలకు సిద్ధం చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.
ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ నటి విద్యా బాలన్‌తో పాటు కోలీవుడ్ నటుడు సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు సమాచారం. అలాగే మొదటి భాగంలో కనిపించిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ పాత్రలు కూడా ఈ సీక్వెల్‌లో కొనసాగనున్నాయని టాక్.
మరింతగా, బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నాడన్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు.
మొత్తానికి, 'జైలర్ 2'పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. భారీ తారాగణం, ఆసక్తికరమైన కథ, హై వోల్టేజ్ యాక్షన్‌తో ఈ చిత్రం మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.





# 'మైసా' నుంచి క్రేజీ అప్‌డేట్.. రష్మిక బర్త్‌డేకు మాస్ ట్రీట్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'మైసా' నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. రష్మిక పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన మాస్ యాక్షన్ పోస్టర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ పోస్టర్‌లో రష్మిక ఇప్పటివరకు కనిపించని రఫ్ అండ్ మాస్ అవతార్‌లో దర్శనమిస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది.
ఈ చిత్రాన్ని దర్శకుడు రవీంద్ర పూలే తెరకెక్కిస్తుండగా, ఇది పూర్తి స్థాయి లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. సాధారణంగా గ్లామర్ పాత్రల్లో కనిపించే రష్మిక, ఈ సినిమాలో పూర్తిగా భిన్నమైన యాక్షన్ పాత్రలో నటిస్తుండటం విశేషం. పోస్టర్‌లో ఆమె స్టైలింగ్, బాడీ లాంగ్వేజ్, ఇంటెన్స్ లుక్ చూసిన ఫ్యాన్స్ ఈ సినిమా మీద భారీ అంచనాలు పెట్టుకుంటున్నారు.
'మైసా' చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. కథ, కథనంలో కొత్తదనం ఉండేలా మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం.
ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతున్న ఈ చిత్రం 2026లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రష్మిక కెరీర్‌లో ఈ సినిమా ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఈ చిత్రంతో ఆమె యాక్షన్ హీరోయిన్‌గా కొత్త ఇమేజ్‌ను సృష్టించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.
మొత్తానికి, 'మైసా' పోస్టర్ విడుదలతోనే భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ సినిమా విడుదలయ్యాక బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# యానిమే వేదికపై రష్మిక

నేషనల్ క్రష్‌గా గుర్తింపు పొందిన రష్మిక మందన్న మరోసారి అంతర్జాతీయ వేదికపై మెరవనున్నారు. ప్రతిష్టాత్మక క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 2026 వేడుకకు ఆమె ప్రజెంటర్‌గా ఎంపిక కావడం విశేషం. జపాన్ రాజధాని టోక్యోలో నిర్వహించనున్న ఈ వేడుకలో భారత్ నుంచి ఎంపికైన ప్రముఖ సినీ తారగా ఆమె నిలిచారు. ఈ అవార్డ్స్ జపనీస్ యానిమేషన్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చిత్రాలు, సిరీస్‌లు, కళాకారులు, సాంకేతిక నిపుణులకు అందజేస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యానిమే అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే ఈ వేడుక మే 23న టోక్యోలో ఘనంగా జరగనుంది. వివిధ దేశాలకు చెందిన ప్రముఖ తారలు ప్రజెంటర్లుగా హాజరవుతుండగా, రష్మిక కూడా ఆ జాబితాలో చోటు దక్కించుకోవడం భారతీయ సినీ రంగానికి గర్వకారణంగా భావిస్తున్నారు. యానిమే పట్ల ప్రత్యేకమైన ఆసక్తి ఉన్న రష్మిక... గతంలో కూడా తన ఇష్టాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ అవకాశం రావడం ఆమె గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తోంది. ఇటీవల భారీ విజయాలు సాధించిన చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రష్మిక... ఇప్పుడు అంతర్జాతీయ అవార్డ్స్ వేదికపై కూడా తన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు.








# 'ఫౌజీ' సెట్స్ నుంచి లీకైన ఫోటోలు..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న భారీ పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'ఫౌజీ' ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. 'సీతారామం' వంటి క్లాసిక్ హిట్ తర్వాత హను రాఘవపూడి రూపొందిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే వేగంగా షూటింగ్ జరుగుతున్న ఈ సినిమా సెట్స్ నుంచి కొన్ని ఫోటోలు లీక్ కావడం చిత్రబృందానికి పెద్ద షాక్ ఇచ్చింది. మొదట ఈ ఫోటోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించబడ్డవని భావించినప్పటికీ, తర్వాత అవి నిజమైన షూటింగ్ స్టిల్స్ అని స్పష్టమైంది.
ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చిత్రబృందం తీవ్రంగా స్పందించింది. లీక్‌లు సినిమా అనుభవాన్ని దెబ్బతీస్తాయని పేర్కొంటూ వెంటనే వాటిని షేర్ చేయడం నిలిపివేయాలని అభిమానులు, నెటిజన్లను కోరింది. అధికారిక ప్రకటనలో, "మేము ఎంతో కష్టపడి రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన అనుభవాన్ని ఈ లీక్స్ దెబ్బతీస్తున్నాయి. థియేటర్లలో ప్రేక్షకులు చూడబోయేది మరింత అద్భుతంగా ఉంటుంది. కాబట్టి లీక్ అయిన కంటెంట్‌ను షేర్ చేయకుండా సహకరించండి" అని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా ఈ హెచ్చరికను పట్టించుకోకుండా ఫోటోలు లేదా వీడియోలను పంచుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కూడా స్పష్టం చేసింది. దీంతో 'ఫౌజీ' టీం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల పెద్ద సినిమాల సెట్స్ నుంచి లీకులు సాధారణంగా మారుతున్న నేపథ్యంలో, చిత్ర బృందాలు మరింత అప్రమత్తంగా మారుతున్నాయి. 'ఫౌజీ' ఘటనతో ఇకపై మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## టొవినో థామస్ 'పల్లిచట్టంబి' తెలుగు ట్రైలర్ విడుదల

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'పల్లిచట్టంబి' చిత్రానికి సంబంధించిన తెలుగు ట్రైలర్ విడుదలైంది. వరల్డ్ వైడ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా విడుదలైన ట్రైలర్‌ను పరిశీలిస్తే.. ఇది చారిత్రక నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథ అని స్పష్టమవుతోంది. ఇందులో టొవినో థామస్ మాస్, రఫ్ అండ్ టఫ్ లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. 19వ శతాబ్దపు కేరళ సామాజిక పరిస్థితులను అద్భుతంగా తెరపై ఆవిష్కరించబోతున్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.ఈ చిత్రాన్ని 'క్వీన్', 'జన గణ మన' వంటి సెన్సేషనల్ హిట్స్ అందించిన దర్శకుడు డిజో జోస్ ఆంటోనీ తెరకెక్కిస్తున్నారు. హీరోయిన్‌గా కయాడ్ లోహర్ నటిస్తోంది. కథలో ఆమె పాత్ర కూడా కీలకంగా ఉండబోతుందని సమాచారం. 'పల్లిచట్టంబి' అనే పదానికి ఆ కాలంలో ఒక ప్రాంతాన్ని రక్షించే వ్యక్తి అనే అర్థం ఉంది. అదే భావంతో ఈ కథను రూపొందించినట్లు చిత్రబృందం చెబుతోంది. యాక్షన్, భావోద్వేగాలు, చారిత్రక నేపథ్యం కలగలిపిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇప్పటికే ట్రైలర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in